సాక్షి
నల్లగొండ
గురువారం । 28 । డిసెంబర్ । 2023





**మున్సిపల్ వైస్ చైర్మన్ మృతి**
మిర్యాలగూడ మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్రా కోటేశ్వర్‌రావు గుండెపోటుతో మృతి చెందారు. - 8లో



**వటపత్రశాయిగా..**
అధ్యయనోత్సవాల్లో భాగంగా యాదాద్రీశుడిని వటపత్రశాయిగా అలంకరించి ఊరేగించారు. - 10లో



**చిరుధాన్యాలతో..**
చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై గడ్డిపల్లి కేవీకేలో మహిళలకు శిక్షణ ఇచ్చారు. - 10లో

## న్యూస్‌రీల్

### ప్రజా పాలన నోడల్ అధికారిగా ఆర్‌వి.కర్ణన్



నల్లగొండ : ప్రజా పాలన ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిగా ఆర్‌వి.కర్ణన్ నియమితులయ్యారు. మొన్నటి వరకు నల్లగొండ కలెక్టర్‌గా పనిచేసిన కర్ణన్ ఇటీవల హెల్త్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. కాగా, గురువారం నుంచి నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాకు నోడల్ అధికారిగా ఆర్‌వి.కర్ణన్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### 30న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి డి.దుర్గా ప్రసాద్

రామగిరి(నల్లగొండ) : జిల్లాలోని అన్ని కోర్టుల్లో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 30న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నల్లగొండ ఫ్యామిలీ కోర్టు జడ్జి డి.దుర్గా ప్రసాద్ తెలిపారు. బుధవారం జిల్లా కోర్టు న్యాయ సేవా సదన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని వివిధ కోర్టుల్లో రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. దీనిపై ఇప్పటికే పోలీసు యంత్రాంగం, న్యాయవాదులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. ముఖ్యంగా ఫ్యామిలీ, క్రిమినల్, సివిల్, వాహన ప్రమాద బీమా, చెక్ బౌన్స్ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓ 659 ద్వారా వాహనదారుల పెండింగ్ చలాన్లకు రాయితీ ఇచ్చిందని తెలిపారు. జిల్లాలో 4,29,131 చలాన్ కేసులకు రూ.24.28 కోట్ల రూపాయలు రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన రాయతీని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.దీప్తి, సీనియర్ సివిల్ జడ్జి డివిఆర్.తేజోకార్తీక్, డీఎస్పీలు పి.వెంకటగిరి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

నల్లగొండ : కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అన్ని మండల కేంద్రాలు, పట్టణాల్లో పార్టీ అధ్యక్షులు కాంగ్రెస్ జెండాలను ఎగురవేయాలని సూచించారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన.. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని పేర్కొన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### 29న ఎంపీ లక్ష్మణ్ రాక

నల్లగొండ టూటౌన్ : బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ఈనెల 29న జిల్లా కేంద్రానికి రానున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సమావేశంలో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు.

### ఆర్టీసీ బస్టాండ్లలో ఖాళీ మడిగెలకు టెండర్లు

నల్లగొండ రూరల్ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఏడు ఆర్టీసీ డిపోల పరిధిలోని బస్టాండ్లలో ఉన్న మడిగెలు, ఖాళీ స్థలాలు, క్యాంటిన్, పార్కింగ్ స్థలాల నిర్వహణకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌ఎం శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్గో సర్వీస్, పెట్రోల్ బంక్‌ల నిర్వహణ, అవుట్‌సోర్సింగ్ ద్వారా సర్వీస్ ప్రొవైడర్ల నియామకం, వివిధ రకాల వ్యాపారాలు, మరుగుదొడ్ల నిర్వహణకు ఈ టెండర్, మాన్యువల్ పద్ధతిలో జనవరి 7వ తేదీలోపు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

### నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకించాలి

సూర్యాపేటటౌన్ : రాజ్యాంగ విలువలు కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని రచయిత, కవి కస్తూరి ప్రభాకర్ కోరారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో కుల వ్యవస్థపై పోరాడాలని పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్‌కు కలిసొచ్చింది



- అసెంబ్లీ ఎన్నికల్లో డీలా పడిన బీఆర్‌ఎస్
- ఉనికి చాటుకోలేకపోయిన బీజేపీ
- పట్టు కోల్పోయిన కమ్యూనిస్టులు
- ఉమ్మడి జిల్లాలో 12 స్థానాల్లో 11 గెలుచుకున్న హస్తం పార్టీ
- 2023లో మారిపోయిన రాజకీయాలు

రివైండ్ 2023

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి జిల్లా రాజకీయాలు ఈ సంవత్సరంలో మారిపోయాయి. 2023 సంవత్సరం కాంగ్రెస్ పార్టీకి బాగా కలిసొచ్చింది. రాజకీయంగా చోటు చేసుకున్న కీలక పరిణామాలు ఆ పార్టీ శ్రేణుల్లో పునరుత్తేజం నింపాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురవేయగా, బీఆర్‌ఎస్ డీలా పడిపోయింది. బీజేపీ, సీపీఎం పోటీ చేసినా కనీస ఉనికిని చాటులేకపోయాయి. జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ 11 చోట్ల గెలుపొంది రికార్డు సృష్టించింది. అప్పటి వరకు 12 స్థానాలు కలిగిన బీఆర్‌ఎస్ డీలా పడి ఒకే ఒక్క స్థానానికి పరిమితమైంది.

**కాంగ్రెస్‌ను ఆదరించిన జిల్లా ప్రజలు..**

2023 సంవత్సరం కాంగ్రెస్ పార్టీకి కలిసొచ్చింది. తెలంగాణ వచ్చాక పదేళ్ల కాలంలో కాంగ్రెస్ అధికారానికి దూరమై ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంది. గతంలో రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపొంది కంచుకోటగా ఉంటూ వచ్చింది. కానీ.. మొన్నటి ఎన్నికల ముందు వరకు ఉమ్మడి జిల్లాలో 12 స్థానాలు బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులే ఉన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట మినహా 11 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించారు.

**ఉనికి చాటుకోలేకపోయిన బీజేపీ, సీపీఎం**

బీజేపీ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ ఓటమి పాలై ఉనికి చాటుకోలేకపోయింది. ఇక సీపీఎం ఉమ్మడి జిల్లాలోని ఏడు స్థానాల్లో పోటీ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఎక్కడా డిపాజిట్ దక్కించుకోలేదు. ఇక కాంగ్రెస్‌తో పొత్తుల వ్యవహారంతో సీపీఐ జాగ్రత్తగా వ్యవహరించింది. ఎక్కడా సొంతంగా పోటీకి దిగలేదు. దీంతో సీపీఐ బలాబలాలు ఈ ఎన్నికల్లో బయట పడలేదు.

**బీఆర్‌ఎస్‌కు చుక్కెదురు**

బీఆర్‌ఎస్‌కు 2023 సంవత్సరం కలిసి రాలేదు. తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత వరుసగా రెండుసార్లు ప్రజలు గులాబీ పార్టీకి అధికారాన్ని అప్పగించారు. బీఆర్‌ఎస్ పాలనపై వ్యతిరేకత రావడంతో 2023 ఎన్నికల్లో ఆ పార్టీని ప్రజలు ఆదరించలేదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో కేసీఆర్ సభలు నిర్వహించారు. కేటీఆర్ కూడా ఆశీర్వాద సభలు, రోడ్‌షోల ద్వారా జిల్లాలో అనేక నియోజకవర్గాల్లో పర్యటించారు. కేసీఆర్ నల్లగొండ జిల్లాలో ఇంకా దత్తత అయిపోలేదు. కొనసాగుతుందని జిల్లాను మరింత అభివృద్ధి చేస్తానని చెప్పినప్పటికి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు విశ్వసించలేదు. దీంతో 12 నియోజకవర్గాలకు గాను 11 స్థానాల్లో అపజయం పాలైంది. ఒక్క సూర్యాపేటలో మాత్రం మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి గెలుపొందారు.

**జిల్లా నుంచి ఇద్దరు మంత్రులు**

అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ముఖ్య నేతలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంత్రి పదవులు దక్కాయి. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రిగా, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో పదేళ్ల తర్వాత నల్లగొండ జిల్లాకు మళ్లీ జోడు మంత్రి పదవులు లభించాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాకు ఒకటే మంత్రి పదవి దక్కిన విషయం తెలిసిందే.

**• వృథాగా 104 వాహనాలు**



104 పథకం రద్దు కావడంతో.. డీఎంహెచ్‌ఓ కార్యాలయ ప్రాంగణంలో వృథాగా పడి ఉన్న సుమారు రూ.30 లక్షల విలువ చేసే వాహనాలు

వాహనంలో బ్యాటరీ చోరీకి గురికావడంతో ఖాళీగా ఉన్న బ్యాటరీ బాక్స్



- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

# ఆరు గ్యారంటీలకు ఒకే దరఖాస్తు



ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**నేటి నుంచి 'ప్రజా పాలన' గ్రామ, వార్డు సభలు**
- గ్రామంలో కుటుంబాలను బట్టి కౌంటర్లు ఏర్పాటు చేస్తాం
- స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు వెంటనే రశీదు ఇస్తాం
- తొలిరోజు 158 పంచాయతీల్లో కార్యక్రమం

'సాక్షి'తో ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నల్లగొండ : 'రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అభయ హస్తం ఆరు గ్యారంటీలకు ఈ నెల 28వ తేదీ నుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం. జిల్లాలో 1026 గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో వారం రోజుల పాటు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహిస్తాం. అందుకు 286 బృందాలను ఏర్పాటు చేశాం. గ్రామంలో కుటుంబాల ఆధారంగా దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లు ఏర్పాటు చేస్తాం. స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు వెంటనే రశీదు ఇస్తామని' నల్లగొండ ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. గురువారం నుంచి ప్రారంభం కానున్న 'ప్రజాపాలన' కార్యక్రమ అంశాలపై ఆయన 'సాక్షి'తో మాట్లాడారు వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రజా పాలన కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాటు చేసింది. ఈ ఆరు గ్యారంటీలకు సంబంధించి కుటుంబానికి ఒకటే దరఖాస్తు సరిపోతుంది. అందులో ఉన్న ఆప్షన్ల ప్రకారం మీరు ఏఏ పథకానికి దరఖాస్తు చేసుకుంటున్నారో ఆ కాలంలో టిక్ చేయాల్సి ఉంటుంది. రేషన్‌కార్డు లేని వారు కూడా ఈ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు నింపే క్రమంలో ఆప్షన్లలో రేషన్‌కార్డు ఉందా లేదా అని రాయాల్సి ఉంటుంది. దరఖాస్తులో పేరు, గ్రామం, పట్టణం, వార్డు తదితర వివరాలతో పాటు ఆధార్ నంబర్ తప్పని సరిగా వేయాలి.

**దరఖాస్తులన్నీ ఆన్‌లైన్..**

ప్రజాపాలన ద్వారా వచ్చిన దరఖాస్తులన్నింటినీ క్రోడీకరించి ఆన్‌లైన్ చేసి ప్రభుత్వానికి పంపుతాం. ప్రభుత్వం ఆయా పథకాలకు అర్హతను నిర్ణయించిన తర్వాత దరఖాస్తులన్నింటినీ పరిశీలిస్తుంది. అయితే గ్రామంలో ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తు స్వీకరిస్తాం. ఎవరైనా ఊరిలో లేకపోయినా గ్రామసభలు పూర్తయ్యేలోపు ఇచ్చినా సరిపోతుంది. దరఖాస్తు తీసుకున్న వెంటనే రశీదు అందజేస్తాం.

దరఖాస్తు ఫారాలు ఇప్పటికే ఆయా మండలాలు, గ్రామాలకు పంపించాం. ప్రతి కుటుంబానికి ఒక దరఖాస్తు ఇస్తున్నాం. అవసరమైన వారు దాన్ని జిరాక్స్ తీసుకుని కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

**సన్నాహక సమావేశాలు పూర్తి..**

ప్రజాపాలన కార్యక్రమానికి సంబంధించి నియోజక వర్గాల్లో సన్నాహక సమావేశాలు పూర్తయ్యాయి. మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రితో పాటు జిల్లా మంత్రుల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణపై ఆదేశాలు ఇచ్చారు. దానికి అనుగుణంగా సభల ద్వారా దరఖాస్తులు స్వీకరించబోతున్నాం. మొదటి రోజు 158 పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో సభలు నిర్వహిస్తున్నాం. ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పాల్గొనున్నారు.

**దరఖాస్తుల స్వీకరణకు కౌంటర్లు..**

గ్రామ జనాభాను బట్టి దరఖాస్తుల స్వీకరణ కోసం కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నాం. పెద్ద గ్రామమై కుటుంబాలు అధికంగా ఉంటే అదనంగా కౌంటర్ ఏర్పాటు చేయాలని అధికారులకు చెప్పాం. మహిళల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు దివ్యాంగులు లైన్‌లో రావాల్సిన అవసరం లేకుండా నేరుగా దరఖాస్తులు స్వీకరించాలని సూచించాం. గ్రామసభ నిర్వహణకు రూ.10 వేల చొప్పున ఎంపీడీఓలకు అందించాం.

**దరఖాస్తు కేంద్రాల్లో ఏర్పాట్లు..**

దరఖాస్తు కేంద్రాల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా టెంట్లు, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నాం. దరఖాస్తులు నింపే క్రమంలో ప్రజలు ఇబ్బంది పడకుండా అక్కడి సిబ్బంది సహకరించాలని సూచించాం. ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తు తీసుకున్న తర్వాతే అధికారులు అక్కడి నుంచి వేరే గ్రామాలకు వెళతారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా దరఖాస్తులు సమర్పించాలి.

## ఎన్నికల ఖర్చుల వివరాలు సమర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్

- ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నల్లగొండ : ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలను ఈ నెల 29వ తేదీలోగా సమర్పించాలని ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోటీ చేసిన అభ్యర్థులు/ఏజెంట్లు, సహాయ వ్యయ పర్యవేక్షణ అధికారులు, అకౌంటింగ్ బృందాలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సాధారణ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ప్రతి రోజూ నిర్వహించిన అకౌంట్స్ రిజిస్టర్లు, క్యాష్ రిజిస్టర్లు, బ్యాంక్ రిజిస్టర్లు, సమగ్ర వివరాలను నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్‌లో సంబంధిత డాటాను నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి ఆర్.కిరణ్‌కుమార్, సహాయ వ్యయ పర్యవేక్షణ అధికారులు, అకౌంటింగ్ బృందాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ పిల్లలపై ప్రేమ చూపాలి



మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

మిర్యాలగూడ : దివ్యాంగ పిల్లలపై తల్లిదండ్రులు ప్రేమ, ఆప్యాయతలను కలిగి ఉండాలని డీఈఓ బొల్లారం భిక్షపతి అన్నారు. మిర్యాలగూడ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అందుతున్న అభ్యసన కార్యక్రమాలను పరిశీలించి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను ప్రేమతో ఆదరిస్తే వారు శారీరక, మానసిక పరివర్త చెందుతారని తెలిపారు. జిల్లాలో 34 భవితా కేంద్రాలు పనిచేస్తున్నాయని, 2279 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు అభ్యసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, 68 మంది ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్లు పనిచేస్తున్నారని వెల్లడించారు. ప్రతి కేంద్రంలో వారానికి ఒకసారి ఫిజియోథెరపి క్యాంపులు నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలకు 19,700 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. ప్రతి మండలానికి నోడల్ అధికారిని నియమించామని.. విధులకు సరిగా హాజరుకాని ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎంఈఓ బాలాజీనాయక్, ఇన్‌క్లూజివ్ రిసోర్స్ టీచర్లు బ్రహ్మచారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్‌బీఐ ఏజీఎం అలీముద్దీన్



మాట్లాడుతున్న ఎస్‌బీఐ ఏజీఎం అలీముద్దీన్

నల్లగొండ : కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ ఏజీఎం అలీముద్దీన్ కోరారు. బుధవారం నల్లగొండలోని గడియారం సెంటర్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కుటుంబాలకు భరోసా ఇస్తాయని తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ మార్చడమే ప్రధాన మంత్రి మోదీ సంకల్పమని పేర్కొన్నారు. పీఎం జీవన జ్యోతి బీమా యోజన, సుర్క్ష బీమా యోజన, పీఎం కిసాన్, పీఎం అటల్ పెన్షన్ యోజన, ముద్ర యోజన తదితర పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా 2024 క్యాలెండర్‌తో పాటు ప్రభుత్వ పథకాలపై బ్రోచర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్, జిల్లా క్షేత్ర ప్రచార అధికారి కోటేశ్వర్‌రావు, నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి వినయ్‌కుమార్, జిల్లా డిప్యూటీ వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ వేణుగోపాల్, హెచ్‌పీసీఎల్ మేనేజర్ మధు, మెప్మా ప్రాజెక్టు అధికారి కరుణాకర్, వికసిత్ భారత్ కో ఆర్డినేటర్లు శ్రీదేవిరెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# రైస్ మిల్లులపై విజిలెన్స్ దాడులు

**మిల్లులకు ప్రభుత్వం ఇచ్చిన ధాన్యానికి, సీఎంఆర్‌కు తేడాలు**
- రైస్ మాఫియాను అణిచివేస్తామని ఇప్పటికే పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటన
- మంత్రి చెప్పిన 24 గంటల్లోనే మిల్లులపై దాడులు



నల్లగొండలోని రామ్‌లక్ష్మణ్ మిల్లులో బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు



అదే మిల్లులో ధాన్యం గోదాములను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నల్లగొండ: నల్లగొండ జిల్లాలో రైస్ మిల్లులపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు పోలీసు స్పెషల్ టాస్క్‌ఫోర్సు ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. నల్లగొండ పట్టణంలోని రామలక్ష్మణ్ రైస్ మిల్లుతో పాటు హాలియాలో ఉన్న వజ్రతేజ రైస్ మిల్లులో కూడా దాడులు చేశారు. జిల్లాలో సీఎంఆర్ విషయంలో అక్రమాలు జరుగుతున్నాయని, రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తున్నారని, వారిపై కఠినంగా వ్యవహరిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం నల్లగొండలో ప్రకటించారు. ఆయన ప్రకటించిన 24 గంటల్లోనే జిల్లాలోని రెండు మిల్లులపై అధికారులు దాడులు నిర్వహించడం గమనార్హం. బుధవారం ఉదయం నుంచి రెండు మిల్లుపై అధికారులు దాడులు నిర్వహించి ప్రభుత్వ పరంగా ధాన్యం కొనుగోలు చేసి ఆయా మిల్లులకు మూడు సీజన్లలో ఎన్ని మెట్రిక్ టన్నుల ధాన్యం ఇచ్చారు...ఆ ధాన్యానికి సంబంధించి సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) కింద ఎంత బియ్యం ప్రభుత్వానికి ఇవ్వాలనేది లెక్కలు చూస్తున్నారు. సీఎంఆర్ కింద ఇవ్వాల్సిన బియ్యం ఇప్పటి వరకు ఎంత ఇచ్చారు? ఇవ్వని బియ్యానికి సంబంధించి ఆయా మిల్లుల్లో ధాన్యం ఉందా...అనే దానిపై అధికారులు గోదాముల్లో లెక్కలు తీస్తున్నారు. గత సంవత్సరం వానాకాలం, యాసంగి సీజన్లతో పాటు ప్రస్తుత సంవత్సరం వానాకాలం సీజన్‌కు సంబంధించి ఇచ్చిన ధాన్యానికి మిల్లర్లు తిరిగి ఇచ్చిన సీఎంఆర్‌కు పొంతన లేనట్లుగా తెలుస్తోంది. సీఎంఆర్ ప్రభుత్వం ఇచ్చిన గడువు మరో నాలుగు రోజుల్లో ముగియనుంది. ఓ మిల్లు ప్రభుత్వం నుంచి తీసుకున్న ధాన్యానికి సంబంధించి 150 ఏసీకేల (290 క్వింటాళ్లకు ఒక ఏసీకే) వరకు బియ్యం ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. ఈ నాలుగు రోజుల్లో ఇవ్వడం సాధ్యం కాదు. అయితే ఆ ఇవ్వని బియ్యానికి సంబందించిన ధాన్యం కూడా ఆ మిల్లుల్లో పూర్తి స్థాయిలో లేనట్లుగా తెలుస్తోంది. మొత్తానికి అధికారులు గురువారం సాయంత్రంలోగా ఈ వివరాలు బయట పెట్టే అవకాశం ఉంది.

**పదేళ్ల తర్వాత దాడులు..**

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మిల్లర్లకు ప్రభుత్వం ధాన్యం ఇవ్వడమే తప్ప ఆ ధాన్యానికి సంబంధించి ఆయా సీజన్ల వారీగా తిరిగి సీఎంఆర్ అప్పజెప్పని పరిస్థితి. చాలా మిల్లులు ధాన్యం తీసుకుంటున్నాయి కానీ సీఎంఆర్ సరిగా ఇవ్వకపోవడంతో కొన్ని మిల్లులను అధికారులు బ్లాక్‌లిస్టులో పెట్టినా తిరు మారలేదు. కొందరు మిల్లర్లు.. ప్రభుత్వం ఇచ్చిన ధాన్యంతో బయట వ్యాపారం చేసుకుంటూ సీఎంఆర్‌ను మాత్రం ఆలస్యంగా పెడుతున్నారు. ఒక సీజన్ ధాన్యమంతా బయట వ్యాపారం చేసుకుంటూ మరో సీజన్ ధాన్యం వచ్చిన తర్వాత అంతకు ముందు సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని సీఎంఆర్ కింద పెడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక రేషన్ బియ్యాన్నే అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటినే తిరిగి సీఎంఆర్ కింద ప్రభుత్వానికి అంటగడుతున్నారన్న ఆరోపణలు జిల్లాలో ఉన్నాయి. ఇదే విషయాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఇటీవల మీడియా సమావేశంలో ప్రస్తావించి వాటిని ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించిన విషయం తెలిసిందే. రైస్ మిల్లులపై దాడులు నిర్వహించిన వారిలో నల్లగొండ విజిలెన్స్ ఎస్పీ రామోజు రమేష్, డీఎస్పీ కమలాకర్‌రెడ్డి, సీఐ రాజుతో పాటు టాస్క్‌ఫోర్స్ సీఐ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## 30 నుంచి రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ క్రీడాపోటీలు



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

నాగార్జునసాగర్ : ఉమ్మడి జిల్లా నెట్‌బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ నుంచి మూడు రోజులపాటు నాగార్జునసాగర్‌లో రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ అసోషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం హిల్‌కాలనీలోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల యాజమాన్యంతో కలిసి క్రీడా మైదానంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 6వ రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు తెలంగాణలోని 22 జిల్లాల నుంచి సుమారు 600మంది క్రీడాకారులు పాల్గొననున్నారని తెలిపారు. 1992–93 10వ తరగతి సెయింట్ జోసెఫ్ పాఠశాల పూర్వ విద్యార్థులు క్రీడాపోటీల నిర్వహణకు ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ అన్నమ్మ, సిస్టర్ ట్రీజ, క్లారా, రిటైర్ పీఈటీ అనురాధ, ఉపాధ్యాయులు శివకుమార్, పూర్వ విద్యార్థులు రాజగోపాల్‌రెడ్డి, కరుణాకర్, నినన్, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య


యాదయ్య (ఫైల్)

చందంపేట: కుటుంబ కలహాలతో చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం చందంపేట మండలంలోని చిత్రియాల గ్రామంలో జరిగింది. మృతుడి బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్రియాల గ్రామానికి చెందిన తుమ్మల యాదయ్య(30) కుటుంబ కలహాలతో మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. ఈ క్రమంలోనే బుధవారం తెల్ల వారుజామున చిత్రియాల సమీపంలోని అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

### గడ్డివాము దగ్ధం


గడ్డివాముపై నీళ్లు చల్లుతున్న ఫైర్ సిబ్బంది

నాగారం: మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పంటించడంతో దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్ధమానుకోట గ్రామానికి చెందిన బుర్ర యాదగిరి తన పశువుల కొట్టం పక్కన గడ్డివామును ఏర్పాటు చేసుకున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం ఆ గడ్డివాముకు నిప్పంటించడంతో పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. దగ్ధమైన గడ్డి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తనకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరాడు.

### కారు ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

కోదాడరూరల్: కారు ఢీకొని వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి మండల పరిధిలోని రంగయ్యగూడేనికి చెందిన పప్పుల రాములమ్మ(80) బుధవారం కోదాడ బస్టాండ్ నుంచి హుజూర్‌నగర్ రోడ్డు వైపు నడుచుకుంటూ వెళ్తుండగా కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో కారు అతివేగంగా వచ్చి ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు సీతారామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ ప్రసన్నకుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదవేంద్రరెడ్డి తెలిపారు.

### భూతగాదాతో ఘర్షణ.. వ్యక్తికి గాయాలు


గాయపడిన ఆకుల మల్లయ్య

మద్దిరాల: భూతగదాతో జరిగిన ఘర్షణలో ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మద్దిరాల మండలంలోని చందుపట్ల గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలి పిన వివరాల ప్రకారం.. చందుపట్ల గ్రామానికి చెందిన ఆకుల వెంకన్న, ఆకుల మల్లయ్యకు వ్యవసాయ భూమికి సంబంధించి బుధవారం గొడవ జరిగింది. ఈ గొడవలో ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా మల్లయ్య తలకు బలమైన దెబ్బ తగిలింది. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం గ్రామస్తులు, కుటుంబ సభ్యులు సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.

# గుండెపోటుతో మున్సిపల్ వైస్ చైర్మన్ మృతి

- నివాళులర్పించిన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు


నివాళులర్పిస్తున్న గుత్తాసుఖేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు


నివాళులర్పిస్తున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్రా కోటేశ్వర్‌రావు అలియాస్ విష్ణు (53) మంగళవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా గెలిచిన ఆయన బీఆర్‌ఎస్ పార్టీలో కీలక నేతగా ఉన్నారు. రెండు సంవత్సరాల క్రితం తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన హైదరాబాద్‌లో చికిత్స పొందారు. మంగళవారం రాత్రి మరోసారి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలిస్తుండగా తుదిశ్వాస విడిచారు. కోటేశ్వర్‌రావు భార్య కుర్రా చైతన్య కూడా 30వ వార్డు కౌన్సిలర్‌గా కొనసాగుతున్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని బాపూజీనగర్ శ్మశానవాటికలో కోటేశ్వర్‌రావు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

**గుత్తా సఖేందర్‌రెడ్డి పరామర్శ..**

కోటేశ్వర్‌రావు మరణ వార్త తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు బంగాగడ్డలోని ఆయన నివాసానికి భారీగా చేరుకుని నివాళులర్పించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు కోటేశ్వర్‌రావు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ పార్టీ అభివృద్ధికి కోటేశ్వర్‌రావు చేసిన సేవలను గుర్తు చేసుకున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు బోరున విలపించారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ సీడీ రవికుమార్, నాయకులు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ నూకల సరళాహనుమంతరెడ్డి, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్దార్థ, వింజం శ్రీధర్, ముక్కపాటి వెంకటేశ్వర్‌రావు, సైదులుబాబు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.


కుర్ర కోటేశ్వర్‌రావు (ఫైల్)

**పరామర్శించిన ఎమ్మెల్యే బీఎల్‌ఆర్..**

స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోటేశ్వర్‌రావు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి. పాదిల శ్రీను, గాయం ఉపేందర్‌రెడ్డి తదితరులున్నారు.

# వైన్ షాపు ఎదుట నిరసన

- అధిక ధరలకు మద్యం అమ్ముతున్నారని ఆరోపణ



వైన్స్ ఎదుట నిరసన తెలుపుతున్న ముకుందాపురం గ్రామస్తులు

మద్దిరాల: మండల కేంద్రంలోని శ్రీవిజయదుర్గ వైన్ షాపు యజమాన్యం ఎమ్మార్పీ రేట్ల కంటే అధికంగా మద్యం అమ్ముతున్నారని బుధవారం మద్దిరాల మండలంలోని ముకుందాపురం గ్రామస్తులు వైన్ షాపు ఎదుట నిరసన తెలిపారు. అధిక ధరలకు మద్యం అమ్ముతుంటే ఎక్సైజ్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎమ్మార్పీ ధరకే మద్యం అమ్మాలని లేదంటే వైన్ షాపును మూసివేయాలని డిమాండ్ చేశారు. నిరసన తెలిపిన వారిలో సీపీఎం జిల్లా నాయకులు మూరగుండ్ల లక్ష్మయ్య, మూరగుండ్ల సోమయ్య, కోరిపెల్లి మధుసూదన్, నర్సింగ్ కొమరయ్య, మోడెం వెంకన్న, రామచంద్రయ్య తదితరులు ఉన్నారు.

# ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోదాడరూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. కోదాడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని తమ్మరబండపాలెంకు చెందిన వాంకుడోతు భిక్షం(46), అతడి తమ్ముడు శివ మంగళవారం పని నిమిత్తం బైక్‌పై కోదాడ మండలంలోని చిమిర్యాలకు వెళ్తున్నారు. మార్గమధ్యలో దొరకుంట శివారుకు వెళ్లగానే గుర్తుతెలియని వాహనం వారి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం భిక్షం మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య కల్యాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాయిప్రశాంత్ తెలిపారు.

# మిర్చిబజ్జీల బండిపై పడిన విద్యుత్ స్తంభం

- బండి ధ్వంసం


నుజ్జునుజ్జయిన మిర్చిబజ్జీల బండి

రామన్నపేట: విద్యుత్ స్తంభం పడి మిర్చిబజ్జీల బండి నుజ్జునుజ్జయ్యింది. బండి నిర్వాహకులు బండికి కొద్దిగా దూరంగా ఉండడంతో వారికి ప్రాణాపాయం తప్పింది. ఈ సంఘటన బుధవారం రామన్నపేటలో జరిగింది. వివరాలు.. రామన్నపేట మండలం నీర్నెముల గ్రామానికి చెందిన ముత్యాల ఆమని, ముత్తయ్య దంపతులు రెండు నెలలుగా రామన్నపేట మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్‌లో మిర్చిబజ్జీల బండి నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. చిట్యాల–భువనగిరిరోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా బుధవారం సుభాష్ సెంటర్‌లో ఉన్న పాత ఇనుప విద్యుత్ స్తంభాన్ని క్రేన్‌తో తొలగిస్తుండగా అదుపుతప్పి పక్కనే ఉన్న మిర్చిబజ్జీల బండిపై పడింది. దీంతో బండి, స్టవ్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రమాద జరిగిన సమయంలో బండి నిర్వాహకులు ఆమని, ముత్తయ్య బండికి కొద్దిదూరంలో ఉండడంతో వారికి ప్రాణాపాయం తప్పింది.

# ఆర్టీసీ అద్దె బస్సులను నిలిపివేస్తున్నాం

- అద్దె బస్సుల ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్బా మధుకర్‌రెడ్డి


మాట్లాడుతున్న మధుకర్‌రెడ్డి

చౌటుప్పల్: జనవరి 5వ తేదీ నుంచి ఆర్టీసీలోని అద్దె బస్సులను నిలిపివేస్తున్నట్టు తెలంగాణ ఆర్టీసీ అద్దె బస్సుల ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్బా మధుకర్‌రెడ్డి తెలిపారు. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలో గురువారం జరిగిన అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాలక్ష్మి పథకంతో తాము తీవ్రంగా నష్టాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఒక్కో బస్సులో పరిమితికి మించి 100–120 మంది రాకపోకలు సాగిస్తున్న కారణంగా టైర్లు పగిలిపోతున్నాయన్నారు. బస్సుల యాజమాన్యాలకు నిర్వహణ భారంగా మారుతోందన్నారు. టైర్ల అరుగుదలతోపాటు డీజిల్ సైతం అధికంగా ఖర్చు అవుతుందన్నారు. అద్దె బస్సుల కేఎంపీఎల్‌ను 4.5కు తగ్గించాలని, కిలోమీటర్‌కు ఇప్పుడు చెల్లిస్తున్న ధరకు అదనంగా రూ.3 పెంచాలన్నారు. ఆర్టీసీకి టైర్లు ఎంత ధరకు లభిస్తున్నాయో తమకు సైతం అదే ధరకు ఇవ్వాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించకపోగా హైదరాబాద్‌లో టెండర్లు పిలవడం తగదన్నారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరకాంతం మహిపాల్‌రెడ్డి, కోశాధికారి ఎన్.సత్యం బాబు, ప్రతినిధులు కందాల శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, సి.బలవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బైక్ చోరీ కేసులో వ్యక్తికి మూడు నెలల జైలుశిక్ష

రామగిరి(నల్లగొండ): బైక్ దొంగతనం కేసులో ఓ వ్యక్తికి మూడు నెలలు జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు జడ్జి కె. శ్రీవాణి బుధవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. నల్లగొండలోని ఎస్‌ఎల్‌ఎన్ స్వామి కాలనీకి చెందిన దైద శ్రీనివాస్‌రెడ్డి 2023 సెప్టెంబర్ 25న నల్లగొండ పట్టణంలోని ఉడిపి హోటల్ ముందు తన బైక్ పార్కింగ్ చేసి టిఫిన్ చేసేందుకు హోటల్‌లోకి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత బయటకు వచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదు. ఎంత వెతికినా బైక్ కనిపించకపోవడంతో నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ ఆర్. నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో బైక్‌ను దొంగిలించింది కరీంనగర్ జిల్లా మిర్‌దొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందిన చెప్యాల నర్సింహగా గుర్తించి అతడిని అరెస్ట్ చేసి నల్లగొండ కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్. మాధురి వాదనలతో ఏకీభవించిన నల్లగొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు జడ్జి కె. శ్రీవాణీ నిందితుడికి మూడు నెలల 10 రోజుల జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు.

# ఎంప్లాయ్ ఐడీ ఇవ్వాలని ధర్నా


హుజూర్‌నగర్ ఆర్‌డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పూర్వ వీఆర్‌ఏలు

హుజూర్‌నగర్ : వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న తమకు ప్రభుత్వం ఎంప్లాయ్ ఐడీ ఇవ్వాలని పూర్వ వీఆర్‌ఏలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయం వద్ద పూర్వ వీఆర్‌ఏలు ధర్నా నిర్వహించి వారు మాట్లాడారు. ఐదు నెలలుగా జీతాలు లేక కుటుంబాలు గడవడం కష్టంగా మారిందన్నారు. ఎంప్లాయ్ ఐడీ ఇచ్చే వరకు సామూహికంగా సెలవులు పెడుతున్నట్లు డీఏఓ నారాయణరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ వీఆర్‌ఏ హక్కుల సాధన సమితి రాష్ట్ర కో చైర్మన్ లక్ష్మల్ల నరసింహ మౌర్య, డివిజనల్ అధ్యక్షుడు చింతమల్ల కోటయ్య, జనరల్ సెక్రెటరీ మాలోత్ నాగు, పిచ్చమ్మ, జి. ఉపేందర్, వీరబాబు, శోభ, ఇందిరా, కె .నరసింహారావు, పి. చెన్నయ్య, ఎం. సతీష్ పాల్గొన్నారు.


వినతి పత్రం ఇస్తున్న పూర్వ వీఆర్‌ఏలు

### వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి

సూర్యాపేట క్రైం: చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున తెల్లవారుజామున మంచు అధికంగా కురుస్తున్నందున వాహనాలు నడిపేవారు ప్రయాణం చేసేవారు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు, సంబంధిత అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జంక్షన్‌ల వద్ద లైటింగ్ పెంచాలని, హైవేపై నిరంతరం పెట్రోలింగ్ చేయాలని ఆదేశించారు. రహదారి వెంట ఉన్న గ్రామాల ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు.

### డీఏఎస్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి: చౌటుప్పల్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న ఒకే ఒక్క డెంటల్ అసిస్టెంట్ సర్జన్ (డీఏఎస్)పోస్టు భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ చిన్న నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులను ఈ నెల 30వ తేదీ లోపు అందజేయాలని పేర్కొన్నారు. ఈ పోస్టును కాంట్రాక్ట్ పద్ధతిలో డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ నియమించనున్నట్లు తెలిపారు. వివరాలకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సంప్రదించాలన్నారు.

# ధ్రువపత్రాల కోసం నిరీక్షణ


భువనగిరి తహసీల్ కార్యాలయంలో కుల, ఆదాయ పత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటున్న జనం

భువనగిరి టౌన్: ప్రజా పాలనలో భాగంగా గురువారం నుంచి ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు దరఖాస్తులు స్వీకరించనుంది. ఇందుకు అర్జీ పెట్టుకునేందుకు జనం కుల, ఆదాయ, ఇతర ధ్రువ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో బుధవారం భువనగిరి పట్టణంలోని మీ సేవా కేంద్రం, తహసీల్దార్ కార్యాలయంలో జనంతో రద్దీ నెలకొంది. మరోపక్క ఆధార్ అప్‌డేట్ కోసం జనం భారీగా తరలి రావడంతో వివిధ బ్యాంకులు, ఆధార్ కేంద్రాలు కిటకిటలాడాయి.

# చోరీ కేసులో ఐదుగురు వ్యక్తుల రిమాండ్

గరిడేపల్లి: చిలుకూరు మండల బేతవోలుకు చెందిన బెక్కం శివ సోమవారం బైక్‌పై వెళ్తుండగా అడ్డగించి రూ.4లక్షలు లాక్కొని వెళ్లిన ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి తెలిపారు. కేతేపల్లి మండలానికి చెందిన బొల్కా వెంకన్న, లింగస్వామి, సతీష్‌రెడ్డి, నాగిరెడ్డి, నిడమనూరు మండలం సూరేపల్లికి చెందిన హరీష్‌ను పట్టుకొని రూ. 4లక్షలు, ఇన్నోవా కారు, బైక్, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

# అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అందిస్తాం

యాదగిరిగుట్ట: ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఆరు గ్యారంటీలను అందించి తీరుతుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ప్రజా పాలనపై యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామ పంచాయతీలో స్పెషల్ ఆఫీసర్లు, మండల అధికారులు ప్రతి ఇంటి నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో ప్రజా పాలన అందిస్తున్నామన్నారు. ప్రజల వద్దకే పాలన అనే విధంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఆలేరును అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, రాష్ట్రంలోనే అగ్ర భాగాన నిలుపుతానన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్లు ఎరుకల సుధా, వస్పరి శంకరయ్య, కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



# తెగుళ్ల నివారణతోనే అధిక దిగుబడులు

- వేరుశనగ సాగులో సస్యరక్షణ చర్యలపై నడిగూడెం ఏఓ రాజగోపాలరావు సూచనలు

పాడి పంట


సాగులో ఉన్న వేరుశనగ పంట

నడిగూడెం: వేరుశనగ సాగులో సకాలంలో తెగుళ్లను నివారిస్తేనే అధిక దిగుబడులు వస్తాయని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు పేర్కొంటున్నారు. సాగులో తెగుళ్లు, పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

**ఆశించే పురుగులు – నివారణ చర్యలు**

**1. ఎర్ర గొంగళి పురుగు**

ఈ పురుగు గుడ్డు దశ నుంచి వచ్చే పిల్ల పురుగులు పొలం గట్ల వెంట ఉన్న గడ్డి మొక్కలపై మరియు వేరుశనగ ఆకులను ఆశించి వాటిపై ఉన్న పచ్చదనాన్ని గోకి తింటాయి. బాగా ఎదిగిన లద్దె పురుగు ఆకులను తినేసి రెమ్మలు, మొదళ్లను మిగులుస్తాయి. కొన్ని సందర్భాలలో పువ్వులను కూడా తింటాయి.

నివారణ చర్యలు: వర్షాలు పడిన సమయంలో దుక్కి చేయడం వలన ఎర్ర గొంగళి పురుగు కోశస్థ దశలు బయటపడి సూర్యరశ్మికి లేక పక్షుల బారిన పడి చనిపోతాయి. అదేవిధంగా గుడ్ల సమూదాయాలను, పిల్ల పురుగులను గమనించి ఏరివేయాలి. మిథైల్ పారాథియాన్ లేదా క్వినాల్‌ఫాస్ పొడి మందును ఎకరానికి 10 కిలోల చొప్పున చల్లాలి. అలసంద, ఆముదం పైర్లను ఎర పంటలుగా వేయాలి. తల్లి లేదా నులిపురుగు దశను గమనించగానే 5శాతం వేప కషాయం ఒక ఎకరానికి ఒక లీటరు పిచికారీ చేయాలి.

**2. వేరు పురుగు**

ఈ గొంగళి పురుగు తెల్లగా ఉండి ఎరుపు రంగు తల కలిగి ఉంటుంది. బాగా ఎదిగిన వేరు పురుగు సి ఆకారంలో ఉండి మొక్క వేర్లను కత్తిరిస్తుంది. తేలికపాటి తువ్వ నేలల్లో ఎక్కువగా ఆశిస్తుంది. వేరు పురుగు ఆశించిన మొక్కలు వాడి, ఎండి చనిపోతాయి. మొక్కలను పీకితే సులువుగా వస్తాయి. మొక్కలు గుంపులు గుంపులుగా చనిపోతాయి.

నివారణ చర్యలు: లోతు దుక్కి చేయడం వలన వేరు పురుగు కోశస్థ దశలు బయట పడి పక్షుల బారిన పడతాయి. లేక భూమి వేడికి చనిపోతాయి. ఫోరేట్ గుళికలను ఎకరానికి 6కిలోలు గింజ విత్తుకొనేటప్పుడు వేయాలి. ఒక కిలో విత్తనానికి ఇమిడాక్లోప్రిడ్ 2.0 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 6.5 మి.లీ. మందును కలిపి విత్తుకోవాలి.

**3. ఆకు ముడత పురుగు**

ఈ పురుగు వేరుశనగ విత్తనాలు విత్తిన 15 రోజుల నుంచి ఆశిస్తుంది. తల్లి పురుగులు బూడిద రంగులో ఉంటాయి. తొలి దశలో ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఉంటాయి. వాటి లోపల ఆకుపచ్చ రంగులో నల్లని తల కలిగిన పిల్ల పురుగులు ఉంటాయి. ఇవి 2, 3 ఆకులను కలిపి గూడు చేసి వాటిలో ఉండి, పచ్చదనాన్ని తినివేయడం వలన ఆకులన్నీ ఎండి, దూరం నుంచి చూస్తే కాలినట్లు కనిపిస్తాయి.

నివారణ చర్యలు: వేరుశనగలో అంతర పంటలుగా జొన్న లేదా సజ్జ 7:1 నిష్పత్తిలో వేయాలి. సోయా చిక్కుడు తర్వాత వేరుశనగ వేయరాదు. ఎకరానికి 4 లింగార్షక బుట్టలు పెట్టి రెక్కల పురుగు ఉనికిని, ఉధృతిని గమనించాలి. పొలంలో పరాన్నజీవులు 50శాతం పైగా ఉన్నప్పుడు క్రిమిసంహారక మందులను వాడాల్సిన అవసరం లేదు. క్వినాల్‌ఫాస్ 400 మి.లీ. లేక క్లోరిపైరిఫాస్ 500 మి.లీ. లేక మోనోక్రోటోఫాస్ 320 మి.లీ. ఒక ఎకరానికి పిచికారీ చేయాలి.

**4. పొగాకు లద్దె పురుగు**

తల్లి పురుగులు లేత గోధుమ రంగులో ఉండి ఆకుపై మరియు అడుగు భాగాన గుంపుగా గుడ్లు పెడతాయి. పిల్ల పురుగులు గుంపులుగా ఉండి ఆకుపై పత్రహరితాన్ని గోకి తినివేసి, జల్లెడాకుగా మారుస్తాయి. బాగా ఎదిగిన పురుగులు ఆకులను తినివేస్తాయి. పగటి వేళ ఈ పురుగులు చెట్ల అడుగు భాగాని లేక మట్టి పెళ్లలు లేక రాళ్ల కింద దాగి ఉండి, రాత్రి పూట మొక్కలను ఆశించిన ఆకులను పూర్తిగా తినివేస్తాయి.

నివారణ చర్యలు: పొగాకు లద్దె పురుగు నివారణకు వేసవిలో లోతు దుక్కి చేయాలి. నత్రజని ఎక్కువ మోతాదులో వాడరాదు. ఎకరానికి పొలంలో 30–40 ఆముదం, పొద్దుతిరుగుడు మొక్కలను ఎర పంటలుగా ఉండేటట్లు చూడాలి. గుడ్ల సమూదాయాన్ని పిల్ల పురుగులను ఏరివేయాలి. లింగాకర్షక బుట్టల ద్వారా తల్లి పురుగుల ఉధృతిని గమనించి టెలినోమస్ రీమస్ అనే గుడ్ల పరాన్న జీవిని 50,000 ఒక ఎకరానికి 7–10 రోజుల వ్యవధిలో 4 సార్లు పొలంలో వదలాలి. గ్రుడ్లు మరియు పురుగులు చిన్నవిగా ఉన్నప్పుడు 5 శాతం వేప నూనె ఒక లీటరు 200 లీటర్ల నీరు లేదా క్వినాల్‌ఫాస్ 400 మి.లీ లేదా మోనోక్రోటోఫాస్ 320 మి.లీ ఒక ఎకరానికి పిచికారీ చేయాలి.

**ఆశించే తెగుళ్లు - నివారణ చర్యలు**

**1. తిక్కా ఆకుమచ్చ తెగులు**

ఇది త్వరగా వచ్చే ఆకుమచ్చ తెగులు. పంట వేసిన 30 రోజుల నుంచి కనిపిస్తుంది. మచ్చలు కొంచెం గుండ్రంగా ఉండి, ఆకు అడుగుభాగాన నల్లని రంగు కల్గి ఉంటాయి.

నివారణ చర్యలు: తట్టుకునే రకాలు సాగు చేసుకోవాలి. తెగులు సోకిన వెంటనే మ్యాంకోజెబ్ 400 గ్రాములు మరియు కార్బండిజమ్ 200 గ్రాములు లేదా క్లోరోథలోనిల్ 400 గ్రాములు లేదా హెక్సాకొనాజోల్ 400 మి.లీ 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరానికి పిచికారీ చేయాలి.

**2. తుప్పు తెగులు**

ఆకుల అడుగు భాగాన ఎరుపు లేక ఇటుక రంగు గల చిన్న పొక్కులు ఏర్పడి ఆకు పైభాగంలో పసుపు రంగు మచ్చలు కనిపిస్తాయి. తెగులు ఉధృతి ఎక్కువైనప్పుడు ఆ పొక్కుల పూల మీద తప్ప మొక్క మిగతా అన్ని భాగాల మీద కనిపిస్తాయి. ఈ తెగులు రబీలో ఎక్కువగా వస్తుంది.

నివారణ చర్యలు: క్లోరోథలోనిల్ 400 గ్రాములు లేదా మ్యాంకోజెబ్ 400 గ్రాములు మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**3. మొదలు కుళ్లు తెగులు**

ఈ తెగులు ఆశించడం వలన విత్తిన తర్వాత మొలకరాకుండానే విత్తనం కుళ్లిపోతుంది. రెండవ దశలో మొలకెత్తిన తర్వాత కాండం పైన నల్లని శిలీంధ్ర బీజాలతో కప్పబడి ఉంటుంది. తెగులు మచ్చలు క్రమేపీ మొదట నేల మట్టంపై ఉన్న కాండం మీద ఏర్పడి క్రమంగా పై కొమ్మలకు వ్యాపిస్తాయి.

నివారణ చర్యలు: విత్తే ముందు కిలో విత్తనానికి 1 గ్రాము టెబ్యుకొనజోల్ లేక 3 గ్రాములు మ్యాంకోజెబ్ చొప్పున కలిపి విత్తనశుద్ధి చేయాలి. తెగులు ఆశించిన వెంటనే పంటపై ఎకరానికి 400 గ్రాములు మ్యాంకోజెబ్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.